క్లుప్తంగా

వేంకటేశ్వర స్వామికి శ్రవణా నక్షత్ర పూజలు



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

ఆదోని అర్బన్: స్థానిక ఇందిరా నగర్‌లోని ఉప్పర వీధిలో వెలసిన వేంకటేశ్వర స్వామి వారి జన్మనక్షత్రం శ్రవణా నక్షత్రం సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. శ్రీ లక్ష్మి వేంకటేశ్వర స్వామి వారి భక్తబృందం ఆధ్వర్యంలో తెల్లవారుజామున స్వామివారికి సుగంధ ద్రవ్యాలు, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, విష్ణు సహస్రనామావళి, సుప్రభాతసేవ, హోమాలు తదితర పూజలు జరిగాయి. ఆలయ పూజారి రమణాచార్యులు, భక్తబృందం పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం



మొక్కలను పంపిణీ చేస్తున్న ఆదోని గ్రీనరీ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ సభ్యులు

ఆదోని అర్బన్: మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని ఆదోని గ్రీనరీ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు లలిత అన్నారు. శుక్రవారం ఆదోని భక్తుల ఇలవేల్పు మహాయోగి లక్ష్మమ్మవ్వ 91వ వెండి రథోత్సవం సందర్భంగా గ్రీనరీ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్, ఆర్ట్స్ కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా 300 మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లలిత మాట్లాడుతూ.. మొక్కలు నాటడం వల్ల వాతావరణ కాలుష్యం నివారించడంతో పాటు వర్షాలు బాగా కురుస్తాయని, పంటలు బాగా పండుతాయన్నారు. కాలుష్యాన్ని నివారించవచ్చని సూచించారు. ఆర్గనైజేషన్ సభ్యులు డాక్టర్ వినీత, హరిత, కోమల, శ్రీధర్, లక్ష్మీదేవమ్మ, కిరణ్మయి, ఎన్ఎస్ఎస్ డివిజన్ అధికారి జొనాథన్ విక్లిఫ్, వలంటీర్లు పాల్గొన్నారు.

త్రీటౌన్ సీఐగా నరసింహరాజు



డీఎస్పీ శివనారాయణ స్వామిని కలిసిన సీఐ నరసింహరాజు

ఆదోని అర్బన్: స్థానిక త్రీటౌన్ సీఐగా నరసింహరాజు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ శ్రీరామ్ కర్నూలు వీఆర్‌కు వెళ్లారు. కర్నూలు వీఆర్‌లో ఉన్న సీఐ నరసింహరాజును ఆదోని త్రీటౌన్‌కు బదిలీ చేశారు. ఈ మేరకు సీఐ డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ శివనారాయణ స్వామిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం స్టేషన్‌లో ఎస్ఐ జయకర్, సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు.

ప్రారంభానికి సిద్ధం



నాబార్డు నిధులతో రూపుదిద్దుకున్న పాఠశాల భవనం

కోసిగి: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల భవన నిర్మాణం రూ.2.10 కోట్లతో రూపుదిద్దుకుంది. ఇందులో కొత్తగా 10 అదనపు గదులు, పాత తరగతి గదులకు మరమ్మతులు, ప్రార్థన స్టేజ్, ఫర్నీచర్స్, డ్రింకింగ్ అండ్ రన్నింగ్ వాటర్, టాయిలెట్స్, ఎలక్ట్రిసిటీ, మేజర్ అండర్ మైనర్ పనులు ముగింపు దశలో ఉన్నాయి. అలాగే కౌతాళం మండలంలోని జిల్లా ఉన్నత పాఠశాలకు నాబార్డు నిధులు రూ.2.30 కోట్లతో పనులు పూర్తి చేయించినట్లు ఆ శాఖ ఏఈ ఖాజా మెయినుద్దీన్ తెలిపారు. త్వరలోనే ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి చేతుల మీదుగా పాఠశాల భవనాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులు గదులను ఉపయోగించుకోవచ్చన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఆదోని అర్బన్: పట్టణ శివారు ఇస్వీ రోడ్డులోని బాలేకల్లు సమీపంలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. శుక్రవారం మృతదేహాన్ని చూసిన స్థానికులు వెంటనే వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా చేసి, కేసు నమోదు చేసుకున్నారు. చుట్టుపక్కల ప్రాంతాల్లోని పొలాల్లో ఆ వ్యక్తి బొక్కా లేకుండా తిరుగుతుండేవాడని స్థానికులు తెలిపారు. పొలంలో మృతదేహం కనిపించినట్లు చెప్పారు.

కనులపండువగా మహా రథోత్సవం

- లక్ష్మమ్మవ్వ నామస్మరణతో మార్మోగిన పురవీధులు
- 5 గంటల పాటు సాగిన రథోత్సవం
- కలశాలతో పాల్గొన్న మూసానహళ్లి గ్రామ చిన్నారులు, మహిళలు



డ్రైఫ్రూట్స్ అలంకరణలో మహాయోగి లక్ష్మమ్మవ్వ



రథోత్సవం ముందు కలశాలతో పాల్గొన్న మహిళలు



లక్ష్మమ్మవ్వ దర్శనం కోసం క్యూలో వేచి ఉన్న భక్తులు

ఆదోని అర్బన్: ఆదోని భక్తుల ఇలవేల్పు మహాయోగి లక్ష్మమ్మవ్వ 91వ వెండి రథోత్సవం శుక్రవారం ఆలయ నిర్వాహకులు రాచోటి రామయ్య ఆధ్వర్యంలో అశేష జనవాహిని మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన వెండి రథంపై లక్ష్మమ్మవ్వ బంగారు విగ్రహాన్ని కొలువుదీర్చగా అవ్వా సేవాసమితి సభ్యులు ముందుకు రథాన్ని లాగారు. డోలు, సన్నాయి, భాజాభజంత్రీల మధ్య లక్ష్మమ్మవ్వకు జై నామస్మరణతో రథోత్సవం ముందుకు సాగింది. దాదాపు 5 గంటల పాటు పురవీధులగుండా రథోత్సవం నిర్వహించగా భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. రథం ముందు మూసానహళ్లి గ్రామ చిన్నారులు, మహిళలు కలశాలతో ముందుకు సాగారు.

డ్రైఫ్రూట్స్‌తో ప్రత్యేక అలంకరణ

మహాయోగి లక్ష్మమ్మవ్వ విగ్రహానికి తెల్లవారుజామున క్షీరాభిషేకం, పట్టువస్త్రాలు, పూల అలంకరణతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేకంగా జీడిపప్పు, ఎండుద్రాక్ష, బాదం ఇతర డ్రైఫ్రూట్స్‌తో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. వేకువజాము నుంచి రాత్రి 10 గంటల వరకు పట్టణ, గ్రామీణ భక్తులు, కొత్తగా పెళ్లయిన జంటలు అవ్వవారిని దర్శించుకున్నారు.

లక్ష్మమ్మవ్వను దర్శించుకున్న ఎమ్మెల్యే, డీఎస్పీ, సబ్ కలెక్టర్ దంపతులు

మహాయోగి లక్ష్మమ్మవ్వను శుక్రవారం ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి దంపతులు, సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్ దంపతులు, డీఎస్పీ శివనారాయణ స్వామి దంపతులు దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అవ్వకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఎమ్మెల్యే, సబ్ కలెక్టర్, డీఎస్పీ దంపతులకు శాలువా కప్పి సన్మానించారు. లక్ష్మమ్మవ్వ జ్ఞాపికను అందజేశారు.

దాతల సాయంతో అన్నదానం ఏర్పాటు

ఏటా మాదిరిగా దాతల సహకారంతో అన్నదానం ఏర్పాటు చేశారు. ఉదయం 10 గంటల నుంచి ఆలయ నిర్వాహకులు ప్రధాన రహదారుల్లో అవ్వ ఆలయం ముందు టెంట్ వేసి భక్తులకు అన్నదానం చేపట్టారు. సబ్ కలెక్టర్ దంపతుల స్వయంగా వడ్డించి అన్నదానం ప్రారంభించారు. అలాగే అల్కూరు మఠం మహర్షి విజయ్‌కుమార్‌ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. స్థానిక సంతపేటలో అవ్వను దర్శించుకుని వస్తున్న భక్తులకు ప్రత్యేక వంటకాలతో భోజనం వడ్డించారు. అలాగే ఎండీ బ్రదర్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం,మంచినీరు,మజ్జిగ అందజేశారు.

భారీ బందోబస్తు

అవ్వ వారి రథోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ శివనారాయణ స్వామి ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు నిర్వహించారు. అలాగే సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలను ఏర్పాటు చేశారు. స్పెషల్ పార్టీ పోలీసులు, ఎస్ఐలు, సీఐలు, కానిస్టేబుళ్లతో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

ఆర్బీకేల ద్వారా విత్తనాలు అందిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న సహాయ వ్యవసాయ సంచాలకులు యం.గిరీష్

పెద్దకడబూరు: రైతులకు ఖరీఫ్ సీజన్‌లో అవసరమయ్యే విత్తనాలు, ఎరువులను స్థానిక రైతు భరోసా కేంద్రాలలోనే అందిస్తామని సహాయ వ్యవసాయ సంచాలకులు యం.గిరీష్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని స్థానిక రైతుభరోసా -1లో వ్యవసాయాధికారి ఎం.వరప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు విత్తనాలు, ఎరువులు అందజేసేందుకు ఈనెల 15 నుంచి రిజిస్ట్రేషన్ ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు. పత్తి విత్తనం వేసేందుకు మే నెల అనువైంది కాదని, జూన్‌లో నేల పూర్తిగా చల్లబడిన తరువాతనే పత్తి విత్తనాలను నాటుకుంటే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. ప్రతి నియోజకవర్గంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్‌లో రైతులు ఉచితంగా విత్తన పరీక్షలు చేయించుకోవచ్చుని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ సలహా మండలి సభ్యులు, వ్యవసాయ సహాయకులు శ్వేత, ఇందు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని టౌన్: నియోజకవర్గంలో వివిధ రకాల జబ్బులతో ప్రైవేటు ఆస్పత్రులో వైద్యం పొంది ముఖ్యమంత్రి సహాయ నిధి కింద ఆర్థిక సాయం కోసం దరఖాస్తు చేసుకున్న వారికి మంజూరైన చెక్కులను శుక్రవారం ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి చేతులమీదుగా పంపిణీ చేశారు. స్థానిక ఎమ్మెల్యే నివాసంలో రూ.10.20 లక్షల చెక్కులను ఏడుగురు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆరోగ్యశ్రీ కింద వైద్య చికిత్సలు అందని వారికి సీఎం సహాయ నిధి కింద సాయం అందిస్తున్నట్లు వెల్లడించారు. కార్వన్‌పేటకు చెందిన నరసింహులుకు ప్రమాదవశాత్తు రెండు కాళ్లకు ఆపరేషన్ చేయించుకోగా రూ.4.20 లక్షలు, పెద్దతుంబళంకు చెందిన జంగాల రంగమ్మకు చర్మం కాలిపోగా చికిత్సకు రూ.1.40 లక్షలు, ప్రశాంతనగర్‌కు చెందిన చంద్ర లివర్ వ్యాధితో మరణించడంతో భార్య లక్ష్మికి రూ.3.20 లక్షలు, మరాఠిగేరికి చెందిన చాంద్‌కు కాళ్లు విరిగిపోగా ఆపరేషన్ కోసం రూ.1.20 లక్షలు, పెద్దహరివాణంకు చెందిన గర్జప్ప కడుపులో వ్యాధి కారణంగా చికిత్స కోసం రూ.20 వేలు మంజూరైనట్లు వివరించారు. ప్రజారోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఆరోగ్య శ్రీ సేవలు విస్తృతం చేసిందని వివరించారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందిన వారికి నెలలోపే సీఎం సహాయనిధి కింద బిల్లులు మంజూరు చేయడం హర్షణీయమన్నారు. ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, వైఎస్సార్‌సీపీ నాయకులు మురళీరెడ్డి, నగరూరు చంద్రశేఖర్ రెడ్డి, రహమాన్, ఇదయ్‌తుల్లా, బాబు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సాగు, తాగునీటిని అందించి తీరుతాం



భూగేని చెరువు వద్ద స్టోరేజ్ ట్యాంక్ పనులపై నాయకులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

కోసిగి: కోసిగి ప్రాంత ప్రజల ఆకాంక్ష మేరకు పులికనుమ రిజర్వాయర్ నుంచి పుష్కలంగా సాగు, తాగునీటిని అందించి తీరుతామని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి స్పష్టం చేశారు. గ్రామ శివారులోని భూగేని చెరువును తాగునీటి స్టోరేజీ ట్యాంకుగా ఏర్పాటు చేసేందుకు జరుగుతున్న పనులను వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీమోహన్ రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సొంత నిధులు రూ.38 లక్షలతో భూగేని చెరువు క్లీనింగ్ పనులు పూర్తి దశకు చేరుకుందన్నారు. పెండింగ్‌లో ఉన్న పైప్‌లైన్ పనులను వేగవంతం చేయాలని కాంట్రాక్టర్ బసిరెడ్డికి సూచించారు. రూ.5 కోట్లతో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌గా మార్పు చేసి ఇచ్చిన మాట ప్రకారం కోసిగి ప్రజలకు ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేసి స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తామన్నారు. అదేవిధంగా పులికనుమ రిజర్వాయర్ నుంచి కోసిగి ప్రాంత పంట పొలాలకు సాగునీటిని అందించేందుకు ప్రత్యేక పైప్‌లైన్ పనులు జరుగుతున్నాయన్నారు. యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయించాలని అధికారులను ఆదేశించామన్నారు. కోసిగి, పెండేకల్లు, చింతకుంట గ్రామాల్లో 1500 ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని అందించి తీరుతామన్నారు. ఎంపీపీ ఈరన్న, మండల కన్వీనర్ బెట్టన గౌడ, నాడుగేని నాగరాజు, బుళ్లి నరసింహులు, ఎస్ఐ రాజారెడ్డి తదితరులు ఉన్నారు.

'తుషార బిందువులు' పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ చేస్తున్న సాహితీవేత్తలు

పెద్దకడబూరు: మండల పరిధిలోని హెచ్.మురవణి ఉన్నత పాఠశాలలో గణితోపాధ్యాయుడిగా పని చేస్తున్న ప్రముఖ బాలసాహిత్యవేత్త గద్వాల సోమన్న రచించిన 34వ పుస్తకం »తుషార బిందువులు«ను శుక్రవారం గుంటూరులో అవిష్కరించారు. ఈ సందర్భంగా గద్వాల సోమన్న ఫోన్ ద్వారా మాట్లాడుతూ ప్రకృతి వైద్యశాల పట్టాభిపురం గుంటూరులో జన విజ్ఞాన వేదిక మూడు రోజుల శిక్షణ తరగతుల్లో భాగంగా తొలి రోజు బాలగేయాల సంకలనం జన విజ్ఞాన వేదిక వ్యవస్థాపకుడు డాక్టర్ వెన్నపూస బ్రహ్మారెడ్డి, జాతీయ కార్యదర్శి జంపా కృష్ణకిషోర్ చేతుల మీదుగా పుస్తకాన్ని అవిష్కరించినట్లు తెలిపారు. అనతి కాలంలోనే 34 పుస్తకాలను ప్రచురించడమే కాకుండా బాలసాహిత్యంలో విశిష్ట సేవలకు ముఖ్య అతిథులు కొనియాడారు. డాక్టర్ సోమశంకర్‌రెడ్డి, డాక్టర్ కోటేశ్వరరావు, కృష్ణయ్య, రమణరావు, సాహితీవేత్తలు శ్రీనివాసరావు, జేవీవీ రాష్ట్ర కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ్‌నగర్‌లో చోరీ



బీరువా పగులగొట్టి వస్తువులు చెల్లాచెదురుగా పడేసిన దృశ్యం

ఆదోని అర్బన్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు వెనక ఉన్న శ్రీరామ్‌నగర్‌లో చోరీ జరిగిన సంఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. విద్యుత్ శాఖలో పని చేస్తున్న జగ్గయ్య మూడు రోజుల క్రితం ఇంటికి తాళం వేసి బంధువుల పెళ్లికి వెళ్లాడు. శుక్రవారం ఉదయం తిరిగివచ్చి చూడగా ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా దుండగులు బీరువా తాళం పగులగొట్టి చోరీ చేసినట్లు గుర్తించారు. ఘటనపై టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేయగా వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. గ్రిల్‌కు వేసిన తాళంతో పాటు, మెయిన్ డోర్‌కు ఏడు తాళాలు, సీక్రెట్ తాళాలను కూడా చాకచక్యంగా పగులగొట్టినట్లు బాధితుడు తెలిపారు. ఇంట్లోకి చొరబడి ఇళ్లంతా చెల్లాచెదురుగా చేసి రూ.30 వేలు నగదు, 10 తులాల వెండి ఆభరణాలు దొంగలించారని వాపోయారు. చోరీ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.

ఐటీఐ కోర్సుకు దరఖాస్తు చేసుకోండి

ఆలూరు రూరల్: 2023–24 సంవత్సరానికి ఆలూరు ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో చదువుకునేందుకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్ శుక్రవారం పత్రిక ప్రకటనలో వెల్లడించారు. ఎలక్ట్రీషియన్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, డీజిల్ మెకానిక్, వెల్డర్, డ్రస్ మేకింగ్, కంప్యూటర్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు జూన్ 6వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు www.iti.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు ఆలూరు ఐటీఐ కళాశాలలో సంప్రదించాలని కోరారు.

పకడ్బందీగా రెమిడియల్ క్లాసులు



ఏపీ మోడల్ స్కూల్‌లో విద్యార్థులను చదివిస్తున్న ఉపాధ్యాయుడు

కోసిగి: మండలంలో 10వ తరగతి, ఇంటర్మీడియెట్‌లో ఫెయిలైన విద్యార్థులకు రెమిడియల్ తరగతులు కొనసాగుతున్నాయి. శుక్రవారం ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ సమీరా రెడ్డి ఆధ్వర్యంలో ఇంటర్మీడియెట్ విద్యార్థులకు ఎకనామిక్స్, కెమిస్ట్రీ, 10వ తరగతి విద్యార్థులకు సోషల్, సైన్స్ సబ్జెక్టులపై తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఫెయిలైన సబ్జెక్టులను నిపుణులైన అధ్యాపకులతో బోధిస్తున్నట్లు వివరించారు. గ్రామీణ ప్రాంతాల బాలికల కోసం నేటి నుంచి హాస్టల్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. బాలికలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే కోసిగిలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలలో తరగతులు నిర్వహిస్తున్నారు.

6వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

స్థానిక ఏపీ మోడల్ స్కూల్ ఇంగ్లిష్ మీడియంలో 6వ తరగతిలో చేరేందుకు ఈనెల 25వ తేదీలోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సమీరా రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ పాఠశాలలో 80 నుంచి 100 మంది వరకు విద్యార్థులకు ప్రవేశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 5వ తరగతి చదివిన విద్యార్థులు అర్హులన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు జూన్ 11వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందని వెల్లడించారు. అందులో సాధించిన మార్కులు ఆధారంగా నిబంధనల మేరకు ప్రవేశాలు కల్పించనున్నట్లు తెలిపారు.

ముస్సిపల్ స్థలం ఆక్రమణదారులకు షాక్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, అడ్వకేట్ మధుసూదన్‌రెడ్డి

ఆదోని అర్బన్: పట్టణంలోని నిర్మల్ టాకీస్, దాని పక్కన ఉన్న స్థలాన్ని ఆక్రమించుకున్న వారిపై కోర్టులో కేసు వేసి గెలిచామని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ అడ్వకేట్ మధుసూదన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. 1954లో మున్సిపల్ అధికారులు వెంకటరెడ్డి అనే వ్యక్తికి ఆదోని డెవలప్‌మెంట్ ఎంటర్‌టైన్‌మెంట్ ట్యాక్స్ కింద మున్సిపాలిటీ ఆదాయం కోసం 1.03 ఎకరాల స్థలాన్ని లీజుకు ఇచ్చారని తెలిపారు. ఆ స్థలంలో నిర్మల్ టాకీసు థియేటర్ నిర్మాణం జరిగిందని చెప్పారు.ఆ టాకీసు షేర్ హోల్డర్స్ థియేటర్ పక్కనున్న స్థలాన్ని లింకు డాక్యుమెంట్లు చూపించి దుకాణాలు ఏర్పాటుచేసి అమ్ముకున్నారని వివరించారు. మున్సిపల్ అధికారులు నోటీసులు ఇవ్వడంతో ఆక్రమణదారులు 2012లో కోర్టుకు వెళ్లారని చెప్పారు. దీనిపై ప్రభుత్వం తరపున కోర్టులో కేసు వేయగా తీర్పు అనుకూలంగా వచ్చినట్లు వెల్లడించారు. కోర్టు ఆర్డర్ రాగానే దుకాణాలను తొలగిస్తామని చెప్పారు. వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు దేవా, నాయకులు నారాయణ, లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

నిబంధనల అతిక్రమణపై చర్యలు తీసుకోవాలి



డిప్యూటీ ఈఓ సుకుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ఆదోని అర్బన్: విద్యాశాఖ నిబంధనలు అతిక్రమించి పట్టణంలో ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్న కార్పొరేట్, ప్రయివేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిప్యూటీ ఈఓ సుకుమార్‌కు రాయలసీమ పరిరక్షణ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి షాహిద్ ఆఫ్రిద్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తూ డొనేషన్ రూపంలో రూ.వేలకు వేలు వసూలు చేస్తున్నారన్నారు. అలాగే అందులో పనిచేస్తున్న ఉపాధ్యాయులపై అడ్మిషన్లు చేయాలని ఒత్తిడి చేస్తున్నారన్నారు. కొన్ని పాఠశాలల్లో సరైన మౌలిక వసతులు లేకున్నా అలాగే నిర్వహిస్తూ అడ్మిషన్లు చేసుకుంటున్నారని ఆరోపించారు. వెంటనే విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన డిప్యూటీ ఈఓ విచారణ చేపడతామని హామీ ఇచ్చారు. నాయకులు నరసింహ, బలరాం, హరి, భరత్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సామూహిక వివాహాలు



వధూవరులను ఆశీర్వదిస్తున్న ప్రదీప్‌రెడ్డి

కౌతాళం: మండల పరిధిలోని మదిర గ్రామంలో వెలసిన ఊటగనూరు తాత మఠంలో శుక్రవారం 30 జంటలకు సామూహిక వివాహాలను వైభవంగా నిర్వహించారు. మఠం ధర్మకర్త పంపారెడ్డి తాత ఆధ్వర్యంలో గ్రామస్తులు, దాతల సహకారంతో అంగరంగ వైభవంగా పెళ్లిళ్ల వేడుక నిర్వహించారు. గత 15 ఏళ్ల నుంచి ఈ వేడుకలను నిర్వహించడం అనవాయితీగా వస్తోంది. శుక్రవారం తెల్లవారుజామునే మఠంలో ప్రత్యేక పూజలు సుప్రభాత సేవ, మహామంగళ హారతి, ఆకుపూజ వంటి ప్రత్యేక పూజల అనంతరం సామూహిక వివాహాలకు హాజరైన జంటలు వారి బంధువులతో జంట గ్రామాలైన మదిర–పొదలకుంట గ్రామాలు జనసంద్రాంగా మారాయి. ఊటగనూరు మఠం పీఠాధిపతి మరి బసవలింగ స్వామి, హాల్వి మఠం పీఠాధిపతి మహంత స్వామి సమక్షంలో అర్చకుల వేద మంత్రాల సాక్షిగా 30 జంటలు ఒక్కటయ్యారు. పార్టీలకు అతీతంగా నాయకులు తరలి వచ్చి వధూవరులను ఆశీర్వదించారు.వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకుడు ప్రదీప్‌రెడ్డి తరలి వచ్చి మఠంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం నూతలన జంటలను ఆశీర్వదించారు. స్థానిక నాయకులు వెంకటరామిరెడ్డి ఉన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు శ్రీనివాసరెడ్డి,చెన్నబసప్ప, కొట్రేష్‌గౌడ్, కురుగొడు తదితరులు ఉన్నారు.

పీఠాధిపతుల తులభారం

ఊటగనూరు, హాల్వి మఠం పీఠాధిపతులకు మఠం ధర్మకర్త పంపారెడ్డి తాత తులాభారం నిర్వహించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

హజ్ యాత్రికులపై భారం పడకుండా ప్రభుత్వ చర్యలు

ఎమ్మిగనూరుటౌన్: రాష్ట్రం నుంచి హజ్‌యాత్రకు వెళ్లే ముస్లింలపై పడే అదనపు ఆర్థిక భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని, దీనిపై ఇప్పటికే ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా ప్రకటన చేశారని జిల్లా వక్ఫ్ బోర్డు ఉపాధ్యక్షుడు రియాజ్‌అహమ్మద్ పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ.. హజ్ యాత్రికుల సమస్యపై ఉపముఖ్యమంత్రితో పాటు హజ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు గౌసేఆజాం, ఎంపీ మిథున్‌రెడ్డి ఢిల్లీలో కేంద్ర పౌర విమానయాన శాఖ సంస్థ మంత్రి జ్యోతిరాధిత్య సింధియాను కలిసి వివరించారన్నారు. మైనారిటీ హక్కుల సమితి అధ్యక్షుడు ఫారుక్‌షిబ్లీ అ విషయాలు తెలుసుకుని మాట్లాడాలని, టీడీపీకి తొత్తుగా మారిన ఫారుక్‌షిబ్లీ అనవసరంగా గందరగోళం సృష్టించడం తగదన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని కలుగొట్ల గ్రామానికి చెందిన ముగ్గురిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ పి.నిరంజన్‌రెడ్డి శుక్రవారం రాత్రి తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ.. గ్రామంలోని ఎస్సీ కాలనీ సమీపంలో బుడగ జంగాలకు చెందిన వారు గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నారు. గుడిసెల ముందు పురుషులు ఆరుబయట స్నానాలు చేస్తుండటం చూసిన మాల రంగన్న ఇళ్ల ముందు మహిళలు ఉంటారు లోపలికి వెళ్లి స్నానాలు చేయాలని చెప్పాడు. దీంతో కోపోద్రికులైన రాసూది భీమన్న, ఉపేంద్ర, శ్రీను కలిసి మాల రంగన్న, మాల బాలమునిపై దాడి చేసినట్లు, ఈ దాడిలో మాల మునిస్వామికి తీవ్ర గాయాలైనట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఎమ్మిగనూరురూరల్: సెబ్ సర్కిల్ పరిధిలోని హాలహర్వి బస్టాప్ వద్ద ఆటోలో అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ జయరాంనాయుడు పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక సెబ్ కార్యాలయం అవరణలో పట్టుబడిన మద్యం, ఆటో, నిందితుడిని అరెస్ట్ చూయించారు. ఆయన మాట్లాడుతూ.. నందవరం మండలం హాలహర్వి బస్టాప్ వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా ఆటోలో 12 బాక్సుల కర్ణాటక మద్యం పట్టుబడినట్లు తెలిపారు. నిందితులు మంత్రాలయం మండలం వగరూర్‌కు చెందిన చిక్కిం ఏసోబు పట్టుబడగా, రాయచూర్ జిల్లా గుంద్రేవులకు చెందిన భీమన్న పరారైనట్లు చెప్పారు. పట్టుబడిన 12 బాక్సుల్లోని 1,152 మద్యం టెట్రా ప్యాకెట్ల విలువ రూ.60 వేలు ఉంటుందని తెలిపారు. దాడుల్లో సెబ్ ఎస్ఐ సోమశేఖర్‌రావు, హెచ్‌సీలు గోపాల్, లింగప్రసాద్, చంద్రమౌళి, కానిస్టేబుళ్లు, నరసింహారెడ్డి, రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.